

రూ .200కు పెరిగిన అల్లం ధర



ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో శుక్రవారం జరిగిన అరకు వారపు సంతలో అల్లం ధర కిలో రూ 200 కు పెరిగింది. దీంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు అల్లం కొనుగోలు చేయడానికి ఇబ్బంది పడగా, సాగు చేసి విక్రయించడానికి తీసుకొచ్చిన గిరి రైతులు మాత్రం ధర భారీగా పెరగడంతో ఆనందం వ్యక్తం చేశారు. గత ఏడాది అల్లం ధర కిలో రూ 30 నుంచి రూ 50 లు వరకు కొనుగోలు చేయగా ,ఈ ఏడాది మాత్రం గతంలో ఎన్నడు లేని విధంగా ఒకేసారి భారీగా రెండు వందలకు ధర పెరగడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అల్లం, టమాటాతో పాటు మిగిలిన నిత్యవసర సరుకులు ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చంద్రయాన్-3 తొలి దశ విజయంపై...

సర్వత్రా హర్షాతిరేకాలు

ప్రజాశక్తి విలేకర్ల యంత్రాంగం : భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో) ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్-3 మొదటి దశ విజయవంతంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమౌతున్నాయి. ప్రపంచంలోని పలు దేశాలు చంద్రుని ఉత్తర ధృవంపై పరిశోధనలు చేపట్టగా, భారత్ మాత్రం జాబిలికి రెండోవైపు, సూర్యరశ్మి సోకని దక్షిణ ధృవంలో అంతరాలపై లోతుగా పరిశోధనకు పూనుకుంది. చంద్రయాన్-1 చివరి దశలో జాబిలిపై రోవర్ ల్యాడింగ్‌లో విఫలమైనప్పటికీ, పట్టుదలతో మలిప్రయోగం చేపట్టి, శ్రీహరికోట సతీష్‌ధావన్ అంతరిక్ష పరిశోధనా కేంద్రం నుంచి శుక్రవారం మధ్యాహ్నం ఎల్‌విఎం-3 ఎం4 ఉపగ్రహ వాహక నౌకతో రాకెట్‌ను ప్రయోగించి, భూకక్ష్యలోకి విజయవంతంగా ప్రవేశపెట్టింది. 24రోజులపాటు భూకక్ష్యలోనే చంద్రయాన్-3 ప్రదక్షిణ అనంతరం వచ్చేనెల 23, లేదా 24 తేదీల్లో చంద్రుని దక్షిణ ధ్రువంపై, 70డిగ్రీల అక్షాంశంలో అడుగిడి అక్కడ అధ్యయనం చేయనుంది. తొలిదశలా కాకుండా చంద్రయాన్ -3 ప్రయోగంలో రోవర్, ల్యాండర్ చంద్రుని దక్షిణ ధృవంపై సాఫ్ట్‌గా ల్యాండింగ్ అయి, భారత్ సత్తాను విశ్వవిఖ్యాతం కావాలి. అభిప్రాయాలివి.

దేశానికే గర్వకారణం..

ప్రజాశక్తి పాడేరు : చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతం కావడం దేశానికే గర్వకారణం. దేశంలో ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయం. దేశ చరిత్రలోనే ఈ విజయం సువర్ణాక్షరాలతో లిఖించబడుతుంది. మా విద్యార్థులకు ఈ విజయం స్ఫూర్తి నిస్తుంది. దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తలు కావడానికి ఈ విజయం విద్యా వంతులకు స్ఫూర్తి నింపుతుంది చంద్రయాన్‌ను విజయవంతంగా ప్రయోగించిన అంతరిక్ష బృందానికి హార్దిక శుభాకాంక్షలు.



జాహ్నవి, టెన్త్ క్లాస్, శ్రీ అక్షర స్కూల్, పాడేరు.

సంతోషంగా ఉంది

చంద్రునిపై నీటి సాంద్రత తెలుసుకోవడానికి, మానవాళి నడవడికకు కావాల్సిన సదుపాయాలను గుర్తించి, భావితరాలకు సంక్లిష్టంగా ఉన్న విషయాలనూ తెలిపేందుకు ఉపయోగపడే 'చంద్రయాన్ 3' విజయవంతం కావడం సంతోషంగా ఉంది.

బెహరా గీతాంజలి, సైన్సు విద్యార్థిని, ఆంధ్ర విశ్వవిద్యాలయం

రెపరెపలాడుతోన్న భారత్ కీర్తిపతాక

చంద్రయాన్-3 విజయంతో భారతదేశ కీర్తి పతాక విశ్వవ్యాప్తంగా రెపరెపలాడుతోంది. పలు ప్రయోగాలతో సత్తా చాటిన ఇస్రో శాస్త్రవేత్తలు, చంద్రునిపై ప్రయోగంలోనూ విజయవంతం కావాలి.

జి. హర్షిత్, టెన్త్ విద్యార్థి,
జెడ్‌పిహెచ్‌ఎస్, చంద్రంపాలెం

ఇస్రో శాస్త్రవేత్తల కృషి గొప్పది

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్ -3 విజయవంతంకావడంలో శాస్త్రవేత్తల కషి అనన్య సామాన్యం. ముందుగా వారికి అభినందనలు. భారతదేశ కీర్తి ప్రతిష్టలను శాస్త్రవేత్తలు ఇనుమడింపజేశారనడంలో అతిశయోక్తి లేదు



పొట్నూరు మురళీ మోహనరావు
హెచ్‌ఎం, జెడ్‌పిహెచ్‌ఎస్, చిట్టివలస

చంద్రునిపై పరిశోధనలు మరింత వేగవంతం

చంద్రుడు ఉపరితలంపై స్థితిగతులను లోతుగా అధ్యయనానికి చంద్రయాన్ -3 ప్రయోగం దోహదపడుతుంది. భవిష్యత్తులో చంద్రునిపై పరిశోధనలు మరింత వేగవంతమౌతాయి. ఈ ప్రయోగం ద్వారా శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సాధించిన అద్భుత ఘనతతో ప్రపంచ దేశాలన్నీ భారత్‌వైపు చూస్తున్నాయి.

పాడి కవిత, సైన్సు విద్యార్థిని, ఆంధ్ర విశ్వవిద్యాలయం

చంద్రయాన్ రూపకల్పనలో..
కొత్తకోట యువ శాస్త్రవేత్త



ప్రజాశక్తి -కొత్తకోట : ఇస్రో సారధ్యంలో శుక్రవారం ప్రయోగించిన చంద్రయాన్-3 విజయవంతంతో రావికమతం మండలం కొత్తకోటలో సంబరాలు మిన్నంటాయి. ఈ అద్భుత ప్రాజెక్ట్ చంద్రయాన్-3 ప్రయోగ రూపకల్పనలో కొత్తకోట గ్రామానికి చెందిన యువ శాస్త్రవేత్త అడ్డూరి రామచంద్రరావు పాలుపంచుకోవడంతో ఆయనకు పలువురు అభినందనలు తెలిపారు. భారతదేశ ప్రతిష్ట పెంచే ప్రయాగాలు మరిన్ని చేయాలని ఆకాంక్షించారు. అంతరిక్ష ప్రయోగాలలో రికార్డు స్థాయి విజయాలతో ప్రపంచానికి భారత్ సత్తా చూపడం హర్షనీయమని పలువురు కొనియోడారు.



పట్టుబడిన గంజాయి, నిందితులతో పోలీసులు

60 కిలోల గంజాయి స్వాధీనం

ఐదుగురు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి-కొయ్యూరు

ఒడిశా నుండి రాజస్థాన్ రాష్ట్రానికి అక్రమంగా తరలిస్తున్న 60 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... ఒడిశా నుండి కొయ్యూరు గంజాయి తరలిస్తున్నట్లు ముందస్తు సమాచారం మేరకు కొయ్యూరు సిఐ స్వామి నాయుడు ఆధ్వర్యంలో కొయ్యూరు, మంపా ఎస్సైలు రాజారావు, లోకేష్, ఎపిఎస్‌పి సిబ్బందితో మండలంలోని కాకరపాడు గ్రామ శివారులో మాటువేశారు. అటుగా వచ్చిన సుజుకీ కారు, ఆటోను తనిఖీ చేయగా అందులో 60 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఆ గంజాయిని, ఒక సుజుకీ కార్‌ను, ఒక ఆటోను, లక్షా ఆరు వేల రూపాలయ నగదును, 5 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న రాజస్థాన్‌కు చెందిన భూరారం పురోహిత్, ప్రవీణ్ కుమార్ జాట్, ఒడిశాకు చెందిన గమ్మేళ నాగేశ్వరరావు, పాంగి సుబ్బు, వంతల శ్రీనును అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కొయ్యూరు సీఐ స్వామి నాయుడు తెలిపారు.

స్పందనకు155 ఫిర్యాదులు

ప్రజాశక్తి -పాడేరు : సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థలో శుక్రవారం నిర్వహించిన స్పందనలో 155 అర్జీలు స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పీఓ వి.అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ వివిధ మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. తాగునీటి సమస్యలు, రహదారి సదుపాయాలు, కళాశాలలు, పాఠశాల ప్రవేశాలు, అంగన్వాడీ భవనాల మంజూరు, విద్యుత్ సదుపాయం వంటి సమస్యలపై అధికంగా ఫిర్యాదులు అందాయి. అర్జీదారుల పిర్యాదులను సకాలంలో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అధికారులను ఆదేశించారు. స్పందనలో స్వీకరించిన ఫిర్యాదులు.. చింతపల్లి మండల కేంద్రంలోని చాడిపేట గ్రామస్తులకు తాగునీటి సదుపాయం కల్పించాలని, సామాజిక భవనం మంజూరు చేయాలని గెమ్మిలి మహేష్, ఎస్.రామన్న వినతి పత్రం సమర్పించారు. అరకు వ్యాలీ మండలం బొండాం పంచాయతీ బి.జాంగూడ గ్రామానికి తాగునీరు, విద్యుత్, రోడ్డు సదుపాయం కల్పించాలని గ్రామస్తులు కిల్లో రాంబాబు, కిల్లో చిట్టిబాబు తదితరులు కోరారు. పెదబయలు మండలం బొండపల్లి పంచాయతీ తాడివీరి గ్రామస్తులు ఎ.వెంకటరావు, పి.నవీన్ కుమార్ తొట్టేడిపుట్టు నుండి తాడివీధి వరకు రోడ్డు నిర్మించాలని కోరారు.డుంబ్రిగుడ మండలం అరుకు పంచాయతీ అరుకు గ్రామంలో వోల్టేజి విద్యుత్ సమస్యతో బాధపడుతున్నామని, ట్రాన్సఫార్మర్ మార్చాలని జెడ్.పి.టి.సి, చట్టారి, ఎం.పి.టి.సి ఎల్. వరాలమ్మ వినతి పత్రం అందజేసారు. జి.మాడుగుల మండలం సంతబయలు గ్రామానికి అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని ఎస్. సరోజిని వినతి పత్రం సమర్పించారు. చింతపల్లి మండలం: అంజలి శనివారం పంచాయతీ వెదురుపల్లి నుండి తామరపల్లి గ్రామం వరకు ఆరు కిలోమీటర్ల రోడ్డు మంజూరు చేయాలని గ్రామస్తులు వంతల లక్ష్మణరావు, పొంగి బిర్సన్న వినతి పత్రం సమర్పించారు. డుంబ్రిగుడ మండలం తూటంగ్ పంచాయతీ జర్రాయి నుండి బుడ్డింగు గ్రామానికి, జర్రాయి నుండి బబ్జాగడ్డ వరకు రోడ్డు నిర్మించాలని సర్పంచ్ జి, కమల, వార్డు మెంబరు ఎం. సీత కోరారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండల రావు, ఇఇలు డి.వి.ఆర్. ఎం. రాజు, కె.వేణుగోపాల్, పంచాయతీ రాజ్ పి. వి. యు, ఇఇ కె.లావణ్య కుమార్, పంచాయతీ రాజ్ ఇఇ టి.కొండయ్య పదాల్, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్‌టి. ఎస్. నంద్, జిల్లా ఉద్యానవన అధికారి రమేష్ కుమార్ రావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి.ఎస్. కుమార్, తదితరులు పాల్గొన్నారు.

13 ఎస్‌హెచ్‌జిలకు బ్యాంకు లింకేజీ:

పాడేరు : అరకువ్యాలీ మండలానికి చెందిన 130 స్వయం సహాయక సంఘాలకు కోటి 52 లక్షల బ్యాంకు లింకేజీ చెక్కును జాయింట్ కలెక్టర్ జె. శివ శ్రీనివాసు, ఐటిడిఏ పీఓ వి. అభిషేక్, అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ చేతుల మీదగా శుక్రవారం ఐటిడి ఏ సమావేశ మందిరంలో పంపిణీ చేసారు. బ్యాంకు లింకేజీని సద్వినియోగం చేసుకోవాలని పిఓ సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి వి.మురళి, ఎపిఎంలు, ఎస్‌హెచ్‌జి మహిళలు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను తెలుసుకుంటున్న జెసి, పిఒ



మాట్లాడుతున్న సిఐ రుద్రశేఖర్

గంజాయి నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: గంజాయి కేసులో పరారీలో ఉన్న నిందితుడు ముత్తెం రవి(30)ను శుక్రవారం అరెస్టు చేసినట్లు అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ సిహెచ్ రుద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ, నిందితుడు ముత్తెం రవి 2021సంవత్సరంలో 1150 కిలోల గంజాయి రవాణాలో పాల్గొన్నారన్నారు. ఆ కేసులో నిందితుడు పరారీలో ఉండేడని అతనిని శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంతోష్ పాల్గొన్నారు.



గోదావరిలో ప్రవహిస్తున్న వరద నీరు

పెరుగుతున్న గోదావరి వరద ప్రవాహం

ప్రజాశక్తి-విఆర్.పురం

నిన్న మొన్నటి వరకు ఇసుక దిన్నెలతో దర్శనమిచ్చిన గోదావరి, ఉన్నటుండి దాని నీటి మట్టం పెరుగుతోంది. తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాల్లో భారీగా వర్షాలు కురవడంతో శబరి నది నీటి మట్టం కూడా కొంతమేరకు క్రమంగా పెరుగుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భారీ వర్షాలు లేకున్నా ఎగువ రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దిగువ ప్రాంతంలోఉన్న విలీన మండలాల్లో కొంతమేరకు గోదావరి ప్రవహిస్తోంది. ప్రస్తుతానికి ఇబ్బంది లేకున్నా ఇక్కడ వర్షాలు కురిస్తే కొంత ఇబ్బందులు పడే అవకాశాలు ఉండొచ్చని విలీన గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఏది ఏమైనా జాగ్రత్త మాత్రం అవసరమే. అధికారులు ముందస్తు జాగ్రత్తగా సహాయ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రయాన్-3 విజయవంతంపై విద్యార్థుల కేరింతలు

ప్రజాశక్తి కొయ్యూరు : చంద్రయాన్-3ను వీక్షించడానికి కొయ్యూరు మండలం డౌనూరు గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ప్రత్యక్ష ప్రసారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభుదాస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జె.వెంకట గిరిబాబు, హాస్టల్ వార్డెన్ హరదేవ్ ఏర్పాటు చేశారు. ప్రయోగం విజయవంతం కావడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ, జాతీయ జెండాను ఎగురవేశారు. భారత్ మాతాకి జై అంటూ నినాదాలు చేశారు.

శాకాంబరిగా దారాలమ్మ దర్శనం

ప్రజాశక్తి -సీలేరు : జీకే వీధి మండలం ఘాట్ రోడ్‌లో వెలసిన దారాలమ్మ అమ్మవారు శుక్రవారం ఉదయం శాకాంబర అవతారంలో భక్తులకు దర్శనమయ్యారు. దారకొండ కిరాణా వ్యాపారి వి. శ్రీనివాస్ దంపతులు ఆర్థిక సహాయం అమ్మవారికి అన్నిరకాల కూరగాయలు పండ్లు పుష్పాలతో శుక్రవారం సర్వాంగ సుందరంగా రూపకల్పన చేశారు. ప్రతి ఎటా దారాలమ్మ అమ్మవారుకు ఆషాడ మాసం చివర దశలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా పూజలు ప్రత్యేక పూజలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. దారకొండ చుట్టుపక్కల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమం అనంతరం వి శ్రీనివాసులు దంపతులు ఆర్థిక సహాయంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ప్రతి గిరిజన కుటుంబానికీ పోస్టల్ సేవలు

ప్రజాశక్తి- మోతుగూడెం : ఏజెన్సీలోని ప్రతి గిరిజన కుటుంబానికీ పోస్టల్ సేవలు అందించటమే ప్రధాన లక్ష్యంగా పోస్టల్ శాఖ పనిచేస్తుందని రాజమండ్రి పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ పి.కోమల్ కుమార్ పేర్కొన్నారు. చింతూరు మండలం డొంకరాయి రామాలయంలో కోమల్ కుమార్ అధ్యక్షతన శుక్రవారం వన్ జన్ ధన్ అనే శీర్షికపై పోస్ట్ ఆఫీస్‌లో లభించే సేవలపై గిరిజనులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్ట్ ఆఫీస్ సేవలో గిరిజనులను భాగస్వామ్యం చేయటమే తన లక్ష్యమని పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన రమణ మాట్లాడుతూ డొంకరాయి పోస్ట్ ఆఫీస్ ప్రజల్లో నమ్మకమైన భాగస్వామిగా ఉందని, ఆకర్షణీయమైన వడ్డీరేట్లతో మహిళా సమ్మాన్ పథకం, సుకన్య పథకం వంటి పథకాలు ప్రజలకు పోస్ట్ ఆఫీస్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటిని ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు. పోస్టల్ సిబ్బంది ప్రతి ఇంటికి తిరిగి పొదుపు పథకాలను తెలియజేసి కొత్త ఖాతాలను తెరిపించాలన్నారు. పోస్టల్ సిబ్బందికి ఏపీ జెన్కో అధికారులు సహకరించారని కోరారు. ఈ కార్యక్రమంలో చింతూరు పోస్టల్ సబ్ డివిజనల్ అధికారి ఎ.నారాయణ, సబ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాసరావు, పోస్టల్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజమండ్రి పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కోమల్ కుమార్



పాఠశాల పాకను పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

పాఠశాల భవనం నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - అరకురూరల్: అరకువేలి మండలం బస్కి పంచాయితీ మారుమూల బొండాగుడ పాఠశాల భవనం తక్షణమే నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి కిండాంగి రామారావు డిమాండ్ చేశారు. శుక్రవారం బొండగుడ గ్రామంలో పర్యటించి పాఠశాల వద్ద ఆయన మాట్లాడుతూ, మండలంలోని బొండగుడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు సుమారు 35 మంది విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. కనీసం పాఠశాల భవనం లేని దుస్థితి నెలకొందని చెప్పారు. గ్రామంలో ఉన్న చిన్న పశువుల పాకలో విద్యను అభ్యసిస్తున్నారని, ఇది బాధాకరమన్నారు. వర్షాకాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం నాడు నేడు పేరుతో పాఠశాల రూపురేఖలు మారుస్తున్నామని ఒకపక్క విపరీతంగా ప్రచారం చేస్తున్నప్పటికీ గిరిజన ప్రాంతంలో మారుమూల గ్రామాల్లో కనీసం పాఠశాల భవనం కూడా లేని పరిస్థితి ఉందని తెలిపారు.ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థులు ఎలా చదువుకుంటారని ఆయన ప్రశ్నించారు.పాఠశాల భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు అనేకసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.



ప్రచారం చేపడుతున్న ఐద్వా మహిళలు

మహిళలపై హింసను అరికట్టాలి : ఐద్వా

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: బిజెపి అధికారం చేపట్టిన నాటి నుండి మహిళలపై దాడులు, హింస రోజు రోజుకు పెరుగుతున్నాయని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వివి జయ, గిరిజన మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.హైమా విమర్శించారు. మండలంలోనీ అరకు వారసంతలో శుక్రవారం విస్తతంగా కరపత్రాలు అందిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళలపై దాడులు జరుగుతున్నా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. మహిళలపై జరిగిన అత్యాచారాలపై కేసులు పెట్టినా పరిష్కారం కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూడాల్సి వస్తుందన్నారు.ప్రత్యేక చట్టాలు ఉన్నప్పటికీ అమలు కాకపోవడంతో లైంగిక వేధింపులకు గురవుతున్నారని చెప్పారు. అధికారానికి రాకముందు మద్యపానం తగ్గిస్తామని సిఎం జగన్ చెప్పి వచ్చిన తర్వాత దీన్ని ఆదాయం వనరుగా మార్చారని విమర్శించారు.తక్షణమే రాష్ట్రంలో మద్యపానంపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐద్వా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన మహిళ నాయకులు కుమారి, కన్నమ్మ పాల్గొన్నారు.

ఫీవర్ సర్వేలు చేయాలి

వైద్యాధికారులకు ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

ఏజెన్సీలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గ్రామాలలో మలేరియా, డెంగ్యూ వ్యాధులకు సంబంధించిన ఫీవర్ సర్వేలు చేయాలని ఆయా పిహెచ్‌సిల వైద్యాధికారులను రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. శుక్రవారం సాయంకాలం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలు నుండి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు సంబంధించిన వైద్యాధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, మలేరియా అధికారులు, ఎంపీహెచ్‌ఈఓ, ఎంటిఎస్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ అన్ని గ్రామాలలో జ్వరాలకు సంబంధించిన కేసులను గుర్తించి వారి రక్త నమూనాలు సేకరించి మలేరియా ఉన్న వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఒక్కొక్క సబ్ యూనిట్ అధికారుల పరిధిలో ఎన్ని గ్రామాలు ఉన్నాయి, ఎన్ని మలేరియా కేసులు నమోదయ్యాయి ఆరా తీశారు. వీటిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో మలేరియా. డెంగ్యూ వ్యాధులకు సంబంధించిన మందులు అందుబాటులో పెట్టుకోవాలని, మందులు కావలసి ఉంటే ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు. అన్ని ఆసుపత్రులలో మలేరియాకు సంబంధించిన కిట్లు, మందులు ప్రస్తుతం ఎన్ని ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. డెంగ్యూ వ్యాధి గురించి కూడా ఆరా తీశారు.

మలేరియా నిర్మూలించే విధంగా అన్ని గ్రామాలలో మొదటి విడత మలేరియా స్ప్రింగ్ పూర్తయిందని, కొన్ని మండలాల పరిధిలో రెండో విడత మలేరియా స్ప్రేయింగ్ జరుగుతుందని, దానిని పూర్తి చేయాలని సూచించారు. ఏజెన్సీలోని ప్రతి గ్రామంలో డెంగు మలేరియా వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు సంబంధించిన పొగ చేయించాలని రంపచోడవరం డిఎల్‌పిఓ రఘువరన్‌ను ఆదేశించారు. ప్రభుత్వ, గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో మలేరియా దోమల నివారణకు చర్యలు చేపట్టాలని అసిస్టెంట్ గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామ తులసిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం ఏరియా ఆసుపత్రి సూపరింటెంటెంట్ డాక్టర్ లక్ష్మి, డాక్టర్ రాధిక, డాక్టర్ కిషోర్, మలేరియా అధికారులు నక్క వెంకటేశ్వరరావు, రామకృష్ణ పాల్గొన్నారు.

రహదారి మరమ్మతులు చేపట్టాలి

జెడ్‌పి సమావేశంలో విజ్ఞప్తి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

ఏజెన్సీ ముఖద్వారమైన ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుండి జడ్డంగి అన్నవరం వరకు ప్రధాన రహదారి శిథిల స్థితిలో ఉందని, తక్షణం ఈ రహదారి మరమ్మతులు చేపట్టాలని జిల్లా పరిషత్ ఛైర్మన్‌ని రాజవొమ్మంగి జెడ్పిటిసి వడుగుల జ్యోతి కోరారు. కాకినాడలో శుక్రవారం జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె రహదారి పరిస్థితి గూర్చి వివరించారు. ఏలేశ్వరం మండలం రమణయ్యపేట నుండి జడ్డంగి అన్నవరం వరకు సుమారు 15 కిలోమీటర్ల రహదారి అధ్వాన స్థితిలో ఉందని, ఈ రోడ్డు వెంబడి ఏలేశ్వరం, రాజవొమ్మంగి, అడ్డతీగల, వై రామవరం మండలాలకు చెందిన వేలాదిమంది వాహన దారులు వందలాది మంది రాకపోకలు సాగిస్తారని తెలిపారు. కాలేజీకి, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, గర్భిణులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల ఎన్నో వాహనాలు గోతుల్లో పడి ప్రమాదాలకు గురికావడంతో పాటు రిపేర్లు వచ్చి ఆగిపోవడం జరుగుతుందని, 108 వాహనం కూడా ఈ రహదారిలో వెళ్లలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఈ విషయంపై ప్రజా ప్రతినిధులుగా తాము ఎన్నిమార్లు అధికారులకు మొర పెట్టుకున్నా పట్టించుకోకపోవడం బాధాకరామన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మరమ్మతులు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని ఆమె జిల్లా పరిషత్ ఛైర్మన్‌ని కోరారు.



జెడ్‌పి ఛైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న జెడ్పీటీసీ జ్యోతి

కూలిన పాఠశాల ప్రహరీ



కూలిన బొర్రా బాలుర పాఠశాల పరారి గోడ

ప్రజాశక్తి -అనంతగిరి: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా ప్రభుత్వ బాలుర ఆశ్రమోన్నత పాఠశాల పరహరి గోడ శుక్రవారం కూలింది పాఠశాలలు రూపు రేఖలు తీర్చిదిద్దలన లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నాడు నేడు పథకం కింద లక్షలాది రూపాయలు వెచ్చించి చేపట్టిన పనులలో నాణ్యత లోపం కారణంగా పనులు చేసి ఆరు నెలలు దశలోనే పరహరి గోడలు. గదుల పైకప్పులు. చేపట్టిన ఇతర పనులలో బీటలు వాడడం పెచ్చులు ఊడిపోవడం వంటి సంఘటనలకు పలు పాఠశాలలు పునరుత్తమౌతున్నాయి దీనికి కారణం చేపట్టిన పనుల దశలోనే క్వాలిటీగా పనులు చేపట్టకపోవడం. తూతు మాత్రం గా పనులు చేపడడం వల్లనే ఈ ఘటనకు చోటు చేసుకుంటుందని విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికులు ఆరోపిస్తున్నారు పరహారి గోడ కూలే సమయంలో విద్యార్థులు అటువైపు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది ఇప్పటికైనా చేపట్టే పనులలో నాణ్యతగ వంటి పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు..

వర్షాలతో ఉప్పొంగిన గెడ్డలు

- రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని గత వారం రోజుల నుంచి ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలకు గెడ్డలు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి, దీంతో రాకపోకలకు అంతరాయం నెలకొంది. మండలంలోని రెండు జిల్లాల సరిహద్దు గ్రామాలైన మెట్టపలెం, జీలుగులపాడు, తాటిపూడి రిజర్వాయర్ జలశయానికి ప్రవహించే గోస్తని గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో వాహనాలు గెడ్డ దాటలేని పరిస్థితి ఏర్పడింది. ఈ వంతెన పనులు నిలిచి పోవడంతో అనంతగిరి మండలం రొంపల్లి పంచాయతీ పరిధి పసిని మర్రిపాలెం, విజయనగరం జిల్లా. అడ్డతీగల పంచాయతీ పరిధి అడ్డతీగలతో పాటు 15 గ్రామాలు ఈ వాగు పై రాకపోకలు సాగిస్తుంటారు.లుంగపర్తి పంచాయతీ పరిధి ఓనుకొండ, కడరేవుతో పాటు మరో ఐదు గ్రామాల గిరిజనులు రాకపోకలు సాగిస్తుంటారు.

అక్టోబర్ 2 నుంచి 'ఆడుదాం ఆంధ్ర క్రీడలు'

విశాఖలో రాష్ట్రస్థాయి పోటీలు : డిఆర్ఒ అంబేద్కర్

ప్రజాశక్తి-పాడేరు: మహాత్మా గాంధీ జయంతి పురస్కరించుకొని అక్టోబర్ రెండు నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల నిర్వహణ చేపడుతున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్ తెలిపారు. జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించనున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలు కార్యక్రమాన్ని ఉద్దేశించి వాటి విధి విధానాలపై అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి అంబేద్కర్ మాట్లాడుతూ, ఈ క్రీడల నిర్వహణ పై విధి విధానాలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. కబడ్డీ, కోకో, వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్ వంటి ఐదు రకాల క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తారని తెలిపారు. 17 ఏళ్లు పైబడిన యువతి యువకులు ఈ క్రీడల్లో పాల్గొన వచ్చునని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలు విశాఖపట్నంలో నిర్వహించేందుకు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. ప్రతి క్రీడాకారుడు గ్రామ సచివాలయంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.క్రీడా జట్లకు పరికరాలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి సలీం భాషా, సంక్షేమ శాఖ అధికారి జనార్దన్ రావు, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి జగన్మోహనరావు, డిఎల్‌డి వో, శాంత లక్ష్మి పాల్గొన్నారు

గిరిజన చట్టాల రక్షణకు పోరాటం ఉధృతం



మాట్లాడుతున్న సన్నిబాబు

ప్రజాశక్తి - పెదబయలు : ఆదివాసి హక్కులు , చట్టాలు సాంస్కృతి పరిరక్షణకై ఈ నెల 28 నుంచి 30 వరకు జరిగే జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ పిలుపునిచ్చింది.మండల కేంద్రంలో గిరిజన సంఘం మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆదివాసి గిరిజన సంఘం పూర్వ అధ్యక్షులు బొండా సన్నిబాబు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగని ధర్మన్నపడాల్ హాజరై మాట్లాడుతూ, ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ఈనెల 28 నుండి 30 తేదీ వరకు ఆదివాసి హక్కులు, చట్టాల, సాంస్కృతి సాంప్రదాయాలు పరిరక్షణకై జిల్లాస్థాయి ఆదివాసి శిక్షణ తరగతుల జరుగుతుందన్నారు.

పీసాచట్టం, 1/70, అటవీ హక్కుల చట్టం, జీవో 3పై సంపూర్ణమైన అవగాహన చేపట్టి భవిష్యత్తు లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఆదివాసి ప్రాంతాల్లో గిరిజనేతర ఉపాధ్యాయులను ఇటీవల 400 మందిని బదిలీ చేయడం గిరిజన హక్కులను కాలరాయడమేనన్నారు. చింతపల్లి ప్రాంతాల్లో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ పేరుతో అడవులను కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతులు మంజూరు చేశాయన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు కిలో సర్బన్న, జంపరంగి సునీల్ కుమార్, బొండా గంగాధరం, బుజ్జిబాబు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా లేఅవుట్ వేస్తే చర్యలు


భూములను పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలోని నాన్ షెడ్యూల్‌తో పాటు షెడ్యూల్ పంచాయతీ పరిధిలో స్థానిక రెవిన్యూ అధికారుల అనుమతులు లేకుండా భూ లేఅవుట్ల పనులు చేపడితే భూ హక్కు చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తప్పవని తహశీల్దార్ .రాంబాయి హెచ్చరించారు. గుమ్మకోట పంచాయతీ బిల్లా కొట్ట, భీమవరం గ్రామాలలో కొంతమంది గిరిజనేతరులు క్రయవిక్రయాలు నిర్వహించిన భూములలో అక్రమంగా గ్రావెల్ మట్టి రవాణా జరుగుతుందనే వచ్చిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో శుక్రవారం ఆ గ్రామాల్లో సందర్శించారు.భూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీకాంత్, వీఆర్వో కోటి బాబు, స్థానిక సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీలు అశోక్ పాల్గొన్నారు

రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిన పంచాయతీల నిధులను జమ చేయాలి

ప్రజాశక్తి-పద్మనాభం : కేంద్ర ప్రభుత్వం గ్రామపంచాయతీలకు విడుదల చేసిన 14,15వ ఆర్థిక సంఘం నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారిమళ్లించి కాజేయడం దుర్మార్గమని మండలంలోని అనంతవరం సర్పంచ్, రాష్ట్ర సర్పంచ్ సంఘం ఉపాధ్యక్షురాలు గొర్రిపాటి వెంకటలక్ష్మి ఆరోపించారు. 2019-2022లో ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రంలోని 12918 గ్రామ పంచాయతీలకు కేంద్రప్రభుత్వం రూ. 8660 కోట్లను విడుదల చేస్తే, సర్పంచ్‌ల అనుమతి లేకుండా సొంత పథకాలను దారి మళ్లించారని, దీని వల్ల గ్రామాల్లో సమస్యలు పరిష్కారం కాక, అభివృద్ధి జరగక పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ..2010కోట్లు, 2023-24 ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రావాల్సిన రూ.2020 కోట్లుతోపాటు గతంలో దారి మళ్లించిన నిధులన్నీ కలుపుకుని మొత్తంగా రూ.12,690 కోట్లు వెంటనే సర్పంచుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సర్పంచ్‌లు, ఎంపిటిసిలకు నెలకు రూ.15 వేలు గౌరవవేతనం ఇవ్వాలని, వాలంటీర్లను పంచాయతీల అధీనంలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం తీర్మానం చేసిందని, అమలుకు పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

ఎరుకలకు ఎస్‌టి కులధ్రువీకరణ ఇవ్వాలి

ప్రజాశక్తి- సీతమ్మధార : వైసిపి నేతల అభ్యంతరంతో ఎరుకల కులస్తులకు ఎస్‌టి కులధ్రువీకరణలను ఇవ్వడానికి సచివాలయ అధికారులు నిరాకరించడం దుర్మార్గమని డివైఎఫ్ఐ, పౌరసంఘాల నేతలు ఆరోపించారు. 45వ వార్డు తాటిచెట్లపాలెంలో ఎరుకల కులస్తులు కుల ధ్రువీకరణకు జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకుంటే సచివాలయ అధికారులు నిరాకరించడంతో సమస్య పరిష్కారానికి సచివాలయంలో అడ్మిన్‌ను డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాజు, పౌరసంఘం అధ్యక్షులు గౌరీష్, దుర్గ, దేముడు, కోటి తదితరులు కలిసి విన్నవించారు. వైసిప నేతలు ఇవ్వొద్దన్నందునే ఎరుకలకు ఎస్‌టి ధ్రువీకరణ జారీ చేయడం లేదని సచివాలయ సిబ్బంది చెప్పడం అన్యాయమని, రాజకీయ దురుద్దేశంతోనే ఇలాంటి చర్యలకు పాల్పడితే న్యాయం కోసం పోరాటం చేస్తామని హెచ్చరించారు. అర్హులకు సంక్షేమమంటూ, ఇలా నేతలు చెప్పారని పేదలకు కష్టాలు పాల్జేయడం అన్యాయమన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రాయితీ

ప్రజాశక్తి -ఆనందపురం: ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు నిరుద్యోగులకు ప్రభుత్వం పలు రాయితీలు ఇస్తుందని ఎపిఎఫ్‌పిఎస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.ఎ.రహీం అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పిఎంఎఫ్ఎంఇ పథకం కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుపై ఆసక్తి ఉన్న లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. పథకం వివరాలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీ, ఇతర ప్రయోజనాలను వివరించారు.సదస్సుకు 55 మంది హాజరు కాగా, వారిలో 12 మంది ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆసక్తి కనబరిచారు. వ్యవసాయాధికారి సంధ్య, ఉద్యానవన అధికారి సోనీ, పశువైద్యాధికారి డాక్టర్ లీలారాణి, డిఆర్‌డిఎ ఎసి నాయుడు, డిపిఎం వైదేహి, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ అధికారి రమేష్, డిఆర్‌పి ప్రతాప్‌కుమార్,ఎస్ వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పంపిణీ

ప్రజాశక్తి పెదబయలు రూరల్: మండలంలో పర్రెడ పంచాయతీ సచివాలయంలో శుక్రవారం స్థానిక సర్పంచ్ చెండా రవిశంకర్ అధ్యక్షతన జగనన్న సురక్ష ధ్రువపత్రాలు అందజేశారు. మండల ఎంపీపీ బొండా వరహాలమ్మ, మండల ప్రాదేశిక సభ్యులు, జెడ్పీటీసీ కూడా బొంజుబాబు , నోడల్ అధికారిగా ఎల్ పూర్ణయ్య హాజరైనారు. ఈ సందర్భంగా సర్పంచ్ రవిశంకర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం , ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందన్నారు. ఏంపీపి వరహాలమ్మ మాట్లాడుతూ, ప్రభుత్వం కల్పించిన సంక్షేమ పథకాలను ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ బొంజుబాబు, మండలాబివృద్ధి అధికారి పూర్ణయ్య, వెలుగు ఏపిఎం కళావతి, సీడీపిఒ రాజేశ్వరి, ఏఇ శ్రీనివాసరావు అజయ్, జీవన్, సిహెచ్ కొండలరావు పాల్గొన్నారు.

కొండల నడుమ ప్రసవ వేదన


కొండల మధ్య ప్రసవించిన గర్భిణి

ప్రజాశక్తి -పెదబయలు రూరల్: మండలంలో గోమంగి పంచాయతీ బొడ్డపుట్టు గ్రామానికి చెందిన వంతల జానకమ్మ నిండు గర్భవతి. పురిటి నొప్పుల తో బాధపడుతుండగా, తన భర్త ఆశా, అంగన్‌వాడిలకు విషయాన్ని చెప్పారు. రహదారి సౌకర్యం లేక శుక్రవారం తన గ్రామం నుండి ఆసుపత్రికి కాలినడకతో ఆమెను తీసుకుని వెళుతుండగా మార్గ మధ్యలో కొండల మధ్య నొప్పులు అధికమై ప్రసవించింది. పాడేరు డివిజన్ తెలుగు దేశం పార్టీ డివిజన్ నాయకులు పాంగి పాండురంగ స్వామి వెళుతూ ఈ సంఘటనను చూశారు. ప్రభుత్వం వెంటనే బొడ్డపుట్టు గ్రామానికి అంబులెన్స్ వెళ్ళుటకు రోడ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రతిరోజు శిశు మరణాలు సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. శిశఉమరణాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండు చేశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలో పాల మామిడి పంచాయతీ బొడ్డగుంది గ్రామం నుండి చిటంపాడు గ్రామం వరకు కిలోమీటర్ మేర నూతన బిటీ రోడ్ నిర్మాణ పనులను శుక్రవారం స్థానిక సర్పంచ్ రామకృష్ణ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, సుమారు రూ.40 లక్షలతో నిర్మాణ పనులు జరుగు తున్నాయని, పూర్తయితే పలు గ్రామాల ప్రజలకు రవాణా కష్టాలు తీరనున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కే సత్యనారాయణ, మండల అధ్యక్షుడు ఎం,కొండబాబు, లువాసింగి ఎంపిటిసి గబ్బాడి సన్యాసి దొర పాల్గొన్నారు


సర్టిఫికెట్ అందజేస్తున్న నాయకులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - మారేడుమిల్లి : అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఎంపీపీ సార్ల లలిత కుమారి అన్నారు. స్థానిక సచివాలయంలో వద్ద శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సర్పంచ్ కొండా జాకబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో 134 మందిరి సర్టిఫికెట్ను అధికారులు, ప్రజాప్రతినిధులు పంపణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైఎస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, వైస్ సర్పంచ్ బొడ్జెటీ వీరబాబు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ అనిల్ ప్రసాద్ (బాబీ), నాయకులు సురేష్ గౌడ్, సత్యనారాయణ, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు స్వస్తి పలకాలి

ప్రజాశక్తి - సీలేరు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, బాల్యవివాహాలకు స్వస్తి పలకాలని స్థానిక ఎస్సై రామకృష్ణ పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం దుప్పిలివాడ పంచాయతీ వలసగెడ్డలో జన జాగృతి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ గిరిజనులతో సమావేశమై మాట్లాడారు. బాలికలకు చిన్నతనంలోనే వివాహాలు చేస్తే నడి వయసుకు వచ్చే సరికి అనారోగ్యం పాలై మృత్యువాతకు గురైపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. అమ్మాయిలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు నిండిన తరువాత వివాహానికి అర్హులవుతారని చెప్పారు. చట్టాన్ని అతిక్రమించి బాల్య వివాహాలు ఎవరు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. గంజాయి అక్రమ రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు. కొంతమంది గంజాయి వ్యాపారులు అమాయక గిరిజనులను పాములుగా వాడుకొని కోట్లాది రూపాయలు సంపాదిస్తుంటే, గిరిజనులు జైలు పాల అవుతున్నారని, దీనిని ప్రతి ఒక్కరు గుర్తించాలని కోరారు. ఎటువంటి సహాయం కావాలన్నా తమ దృష్టికి తీసుకొస్తే ఉన్నత అధికారులకు సంప్రదించి న్యాయం చేసే విధంగా కృషి చేస్తానని ఎస్ఐ రామకృష్ణ హామీ ఇచ్చారు.

గంగవరం పోర్టు కార్మికులకు విశాల మద్దతు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : తమకు న్యాయం చేయాలని కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్న గంగవరం పోర్టు కార్మికుల పోరాటానికి మద్దతుగా శుక్రవారం టిబి హాస్పిటల్ కార్మికులు సంఘీభావ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిబి హాస్పిటల్ కార్మికుల యూనియన్ నాయకులు పి.వెంకటరావు మాట్లాడుతూ గంగవరం పోర్టులో అక్రమంగా తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలన్నారు. నోటీసులు రద్దు చేయాలన్నారు. పోర్టులో కార్మిక చట్టాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిబి హాస్పిటల్ కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పి.పోతురాజు, వి.కేశవ, మానసిక వైద్యశాల కార్మికుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మి, పి.రాజు, గొల్లాజీ, సెక్యూరిటీ విభాగం నుంచి పి.కుమార్ పాల్గొన్నారు.

834వ రోజుకు ఉక్కు జెఎసి దీక్షలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు శుక్రవారానికి 834వ రోజుకు చేరాయి. దీక్షలో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కెవిపి.చంద్రమౌళి, ఇ.రాంబాబు, జె.శ్రీనివాసరావు, ఎన్.నారాయణ పాల్గొన్నారు.

వెయ్యి ఎకరాలలో టాయ్ పార్క్

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి అమర్‌నాథ్
గ్లోబల్ ఈ-కామర్స్‌లో అడుగుపెట్టిన పల్స్ ఫ్లష్ - ఘనంగా ప్రారంభ వేడుక


బొమ్మలను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - గాజువాక : రాష్ట్రంలో వెయ్యి ఎకరాలలో టాయ్ పార్క్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు వచ్చాయని, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో సంప్రదించి త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. గాజువాక గ్రీన్ సిటీలో ఉన్న పల్స్ ఫ్లష్ బొమ్మల కంపెనీ డిస్నీ, వాల్‌మార్ట్, టెస్కో, హాస్బ్రో, స్పిన్ మాస్టర్ తదితర వ్యాపార సంస్థల ద్వారా న్యూయార్క్, ఫ్లోరిడా, శాన్ ఫ్రాన్సిస్కోతో పాటు యుఎస్‌లోని మరిన్ని నగరాలకు తమ బొమ్మలను ఎగుమతులు చేసేందుకు వీలుగా గ్లోబల్ ఈ-కామర్స్‌ను శుక్రవారం మంత్రి అమర్‌నాథ్ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల తాను శ్రీ సిటీలో పర్యటించినప్పుడు దేశంలో బొమ్మల మార్కెట్‌కు ఉన్న ప్రాధాన్యత ఏమిటో తెలిసిందని, దేశవ్యాప్తంగా ఏడాదికి 7 నుంచి 8 లక్షల కోట్ల రూపాయల విలువైన బొమ్మల విక్రయాలు జరుగుతున్నాయని తెలిపారు. బొమ్మల తయారీలో చైనా అగ్రస్థానంలో ఉందని, త్వరలోనే ఆంధ్రప్రదేశ్ టాయ్స్ ఎక్స్‌పోర్ట్స హబ్‌గా మారనుందని తెలిపారు. ఎపిలో టాయ్ పార్క్ ఏర్పాటు చేయడం వల్ల 30 నుంచి 40 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పల్స్ ఫ్లష్ ప్రైవేట్ ఇండియా లిమిటెడ్ ప్రెసిడెంట్ అజయ్ సిన్హా మాట్లాడుతూ బొమ్మలు తయారీపై తనకు మక్కువ ఎక్కువని, సుమారు 30 సంవత్సరాల నుంచి తాను ఈ రంగంలో దేశ, విదేశాల్లోని అనేక సంస్థలలో కీలక బాధ్యతలు పోషించానని చెప్పారు. 1995లో నోయిడాలో బొమ్మలను తయారు చేశామని, అప్పట్లో దేశంలో డిస్నీ లైసెన్స్ తన సంస్థకు మాత్రమే ఉండేదని తెలిపారు. 1997 నుంచి 2000 సంవత్సరం వరకూ తమ సంస్థ తయారుచేసిన బొమ్మలను తైవాన్, సౌత్ కొరియా తదితర దేశాలకు ఎగుమతి చేశామని చెప్పారు. నాణ్యతతో కూడిన బొమ్మలను తయారుచేయాలన్నదే తన లక్ష్యమని, అయితే ఆ సమయంలో ముడి సరుకు సమస్య ఎదుర్కోవలసి వచ్చిందని అన్నారు. ఎన్ని కష్టనష్టాలు వచ్చినా నాణ్యమైన బొమ్మల తయారీలో వెనుకడుగు వేయకూడదన్న లక్ష్యంతో ముందుకు సాగామన్నారు. 2011-12 మధ్య తిరుపతి దగ్గర ఉన్న శ్రీ సిటీలో పల్స్ ఫ్లష్ బొమ్మల తయారీకి శ్రీకారం చుట్టానని చెప్పారు. శ్రీ సిటీలో కేవలం ఐదు ఎకరాల్లో ఏర్పాటు చేసిన పరిశ్రమలో ఎగుమతులకు అనువైన బొమ్మల తయారు చేస్తున్నామని అజయ్ సిన్హా తెలియజేశారు. ఆ తర్వాత కాకినాడలో 300 ఎకరాల్లో పల్స్ ఫ్లష్ బొమ్మల తయారీ పెద్ద ఎత్తున జరుగుతున్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో ఫార్మా కంపెనీలు పెద్ద ఎత్తున రావడంతో తమ కార్యకలాపాలను విశాఖపట్నం, నగరికి మార్చుకున్నామని చెప్పారు. విశాఖలో ప్రస్తుతం నడుస్తున్న తమ కంపెనీని మరింతగా విస్తరించినందుకు రాష్ట్ర ప్రభుత్వ సహాయ సహకారాల కోసం ఎదురు చూస్తున్నామని ఆయన తెలియజేశారు. ప్రస్తుతం విశాఖలో తయారవుతున్న బొమ్మలను విదేశాలలో ఉన్న చిన్నారులకు గ్లోబల్ ఈ-కామర్స్‌లోని డిస్నీ, వాల్‌మార్ట్, టెస్కో, హాస్బ్రో, స్పిన్ మాస్టర్ తదితర వ్యాపార సంస్థల ద్వారా చేరవేయనున్నామన్నారు.

చిరస్మరణీయుడు రాజారావు



రాజారావు చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అధికారులు, నాయకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రజారోగ్య శాఖ సాంకేతిక విభాగం విశాఖపట్నం సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీరుగా పనిచేసిన కోరాబు రాజారావు గిరిజన మారుమూల ప్రాంతంలో జన్మించి ఇంజినీరుగా ఎదగడం గొప్ప విషయమని ఎపి టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ కొనియాడారు. విశాఖ నగరంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రాజారావు సంస్మరణ సభలో ప్రసన్నకుమార్ మాట్లాడుతూ గత నెల 30న అనారోగ్య కారణంతో మెడికవర్ ఆసుపత్రిలో మృతిచెందిన కోరాబు రాజారావు గిరిజన ప్రాంత మణిహారమని అన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లా చింతపల్లి మండలం అంతర్ల గిరిజన గ్రామంలో జన్మించి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి చదువుకొని అసిస్టెంట్ ఇంజినీరుగా మున్సిపాల్టీలో చేరి అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తూ ఎదిగారని రాజారావును ప్రశంసించారు. ఉన్నతంగా ఎదిగినా సేవా దృక్పథంతోనే రాజారావు విధుల్లో వ్యవహరించారన్నారు. పబ్లిక్ హెల్త్ (ఎఫ్ఎసి) విశాఖపట్నం నుంచి గణపతిరావు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయగా పలువురు ఇంజినీరింగ్ అధికారులు, పురపాలక సంఘాలకు చెందిన అధికారులు, జివిఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.


వాహన తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

పోలీసుల విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పరిసర ప్రాంతాల్లో పోలీసులు శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అణువణువునా గాలింపు చర్యలు చేపట్టారు. స్థానిక ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో సిఆర్పిఎఫ్ స్పెషల్ పార్టీ పోలీసు బలగాలని మోహరించి ఆంధ్ర ఒరిస్సా సరిహద్దుల నుంచి వచ్చే పోయే వాహనాలను ఏపీ జెన్కో చెక్‌పోస్టు వద్ద క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించారు. వ్యక్తులు యొక్క ఆధార్ కార్డులు వాహనాల పత్రాలు పరిశీలించి అనంతరం విడిచి పెట్టారు. గంజాయి అక్రమ రవాణా ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు నుంచి రవాణా జరుగుతుంది అని ఉద్దేశంతో పోలీసులు ఆ దిశగా ప్రత్యేక దృష్టి సారించారు. తనిఖీల్లో భాగంగా అసాంఘిక శక్తులపై ప్రత్యేక దష్టి సారించారు.

దారాలమ్మ ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - సీలేరు : జీకే వీధి మండలం దారాలమ్మ అమ్మవారి ఆలయంలో హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ ఈవో సాంబశివరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ ఏడాది అమ్మవారి పండగ మూడు నెలల అనంతరం హుండీలో ఆదాయాన్ని దేవాదాయ శాఖ అధికారులు గ్రామస్తులు సమక్షంలో లెక్కింపు చేశారు. రూ.4,50,325 ఆదాయం అమ్మవారికి నగదు రూపేన వచ్చింది. ఈ సందర్భంగా ఈవో సాంబశివరావు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వచ్చిన ఆదాయాన్ని దేవాదాయ శాఖ అకౌంట్లో జమ చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ చంద్ర తేజ, దేవాలయ పరిరక్షణ సమితి ఎగ్జిక్యూటివ్ మెంబర్ ఈశ్వరరావు రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐరన్ మాత్రల పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యూరు : కొయ్యూరు మండల కేంద్రంలో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల-2లో చదువుతున్న విద్యార్థులకు హాస్టల్ వార్డెన్ వేణు ఆధ్వర్యంలో శుక్ర వారం ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం చెల్లమ్మ, ఆశా కార్యకర్త లక్ష్మి వైద్య సిబ్బంది పాల్గొని, విద్యార్థులకు స్వయంగా ఐరన్ మాత్రలు మింగించారు. విద్యార్థుల్లో రక్తహీనత నివారణకు, మెరుగైన ఆరోగ్యం కోసం ఈ క్యాంపు నిర్వహించామని వార్డెన్ వేణు తెలిపారు.

రైల్వే పార్కులో ప్రవేశ రుసుం తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఈస్ట్ కోస్ట్ రైల్వే ఎస్ఎ పార్క్ (రైల్వే పార్క్)లో వాకింగ్ చెయ్యడానికి ప్రవేశ రుసుము వసూలు చేయాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వార్వా ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం రైల్వే డిఆర్ఎం అనూప్ సత్పతికి వినతిపత్రం సమర్పించారు. పార్కులో ప్రవేశ రుసుం రూ.50 నుంచి రూ.100కి పెంచారన్నారు. వాస్తవానికి గతంలో రూ.50ని ప్రవేశ రుసుంగా నిర్ణయించినా అమలు చేయలేదన్నారు. తాజాగా రూ.100గా నిర్ణయించి అమలు చెయ్యడానికి గేట్లు మూసేశారన్నారు. రైల్వే ప్రజలు చెల్లించే ఛార్జీలతో నడుస్తోందని, ఈ నేపథ్యంలో రైల్వే ఆస్తులు ప్రజల ఆస్తులని అన్నారు.

పేదల ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వం తాజాగా ఇచ్చిన జిఒ ప్రకారం పేద, బడుగు, బలహీన వర్గాల్లో ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ ఉన్న వారి ఇళ్లను రిజిస్ట్రేషన్ చేసే కార్యక్రమం శుక్రవారం టర్నర్ చౌల్ట్రీ వద్ద ఉన్న రిజిస్టర్ కార్యాలయంలో చేపట్టారు. .దక్షిణ నియోజకవర్గం 35వ వార్డు పరిధిలో ఉన్న వారికి రిజిస్ట్రేషన్ చేయడం పట్ల ఆ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు హర్షం వెలిబుచ్చారు.